కలెక్టర్లను అనవసరంగా వేధించొద్దు

ఇసుక అక్రమ మైనింగ్ కేసులో ఈడీకి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: తమిళనాడులో అక్రమ మైనింగ్ కేసులో జిల్లా కలెక్టర్లను అనవసరంగా వేధించొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దర్యాప్తు పేరుతో కలెక్టర్లను ఈడీ కార్యాలయంలోనే రాత్రి 8.30 వరకు కూర్చోబెడుతున్నారని రాష్ట్రప్రభుత్వం ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కోర్టు ఈ ఆదేశాలు జారీచేసింది. ఈ కేసులో ఐదుగురు కలెక్టర్లను ఏప్రిల్ 25లోగా హాజరుకావాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వారు ఈడీ ముందు హాజరయ్యారని ప్రభుత్వ తరపు న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు తెలిపారు. ఈ సందర్భంగా ఈడీ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. వారు ఈడీ ముందు హాజరయ్యారని, అయితే ఎలాంటి డాక్యుమెంట్లు కానీ, వివరాలు కానీ ఈడీకి అందజేయలేదని చెప్పారు. దీనికి సిబల్ స్పందిస్తూ.. ఈడీ సమన్లలో కోరిన వాటిని అందించినట్టు స్పష్టంచేశారు. ఏయే డాక్యుమెంట్లు ఇవ్వలేదో స్పష్టం చేయాలని ఈడీని ఈ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. అనంతరం సిబల్ మాట్లాడుతూ.. కలెక్టర్లు 11 గంటలకు ఈడీకి ఆఫీసుకు వచ్చారని, వారిని రాత్రి 8.30 వరకు కార్యాలయంలోనే కూర్చోబెట్టారని పేర్కొన్నారు. దీనిపై కోర్టు స్పందిస్తూ కలెక్టర్లను అనవసరంగా వేధించొద్దని ఈడీకి స్పష్టంచేసింది. తదుపరి విచారణను జూలైకి వాయిదా వేసింది.

సీఐఎస్‌సీఈ 10, 12 బోర్డు పరీక్షల్లో బాలికలదే హవా

ఈ ఏడాది నుంచి మెరిట్ జాబితాకు స్వస్తి

న్యూఢిల్లీ, మే 6: సీఐఎస్‌సీఈ 10, 12 తరగతుల బోర్డ్ పరీక్షల్లో బాలికలు మరోసారి సత్తా చాటారు. పదో తరగతిలో 99.65 శాతం మంది, 12వ తరగతిలో 98.12 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత సాధించగా, బాలురు 10లో 99.13 శాతం, 12వ తరగతిలో 97.53శాతం ఉత్తీర్ణత పొందారు. బోర్డ్ ఎగ్జామ్స్ ఫలితాల్ని సీఐఎస్‌సీఈ సోమవారం విడుదల చేసింది. గత ఏడాదితో పోల్చితే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగిందని తెలిపింది. విద్యార్థుల మధ్య అనారోగ్యకరమైన పోటీకి దారితీస్తున్నదని మెరిట్ జాబితాను విడుదల చేయటం ఈ ఏడాది నుంచి నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నది. పదో తరగతి బోర్డ్ ఎగ్జామ్స్‌లో 100 శాతం ఉత్తీర్ణతతో ఇండోనేషియా, సింగపూర్, దుబాయ్‌లోని స్కూల్స్ అత్యుత్తమ పనితీరును కనబర్చాయి.

ప్లీజ్.. మాల్దీవులకు రండి!

భారతీయులను కోరిన పర్యాటక మంత్రి ఫైజల్

దుబాయ్: భారతీయులు మాల్దీవులకు రావాలని, పర్యాటకంపైనే ఆధారపడిన తమ దేశ ఆర్థిక వ్యవస్థకు సహకరించాలని మాల్దీవుల టూరిజం శాఖ మంత్రి ఇబ్రహీం ఫైజల్ అభ్యర్థించారు. ఆయన సోమవారం పీటీఐతో మాట్లాడుతూ భారత్, మాల్దీవులు మధ్య చారిత్రక సంబంధాలు ఉన్నాయని అన్నారు. కొత్తగా ఎన్నికైన తమ దేశ ప్రభుత్వం భారత్‌లో కలిసి పనిచేయాలని అనుకొంటున్నదని, తాము ఎల్లప్పుడూ శాంతియుత, స్నేహపూర్వక వాతావరణాన్ని కోరుకుంటామని చెప్పారు. మాల్దీవుల అధ్యక్షుడిగా ముయిజ్జు బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించాయి. భారత్‌పై పలువురు మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మాల్దీవులకు వెళ్లే భారత పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గింది.

మూడోసారి రోదసిలోకి సునీతా విలియమ్స్

బోయింగ్ 'స్టార్‌లైనర్' ద్వారా నేడు నింగిలోకి

వాషింగ్టన్, మే 6: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ ముచ్చటగా మూడోసారి రోదసి యాత్రకు వెళ్లనున్నారు. బోయింగ్ సంస్థకు చెందిన 'స్టార్‌లైనర్' వ్యోమనౌకలో ఆమె మరో వ్యోమగామి బచ్ విల్మోర్‌తో కలసి అంతరిక్షయానం చేయనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8 గంటల 4 నిమిషాలకు ఫ్లోరిడాలోని కేప్ కెనవరాల్ లాంచింగ్ స్టేషన్ నుంచి ఈ వ్యోమనౌక నింగిలోకి దూసుకెళ్లనున్నది. ఇందులో మిషన్ పైలట్‌గా వ్యవహరించనున్న సునీతా విలియమ్స్ (58).. అంర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుని అక్కడ వారం రోజులపాటు గడపనున్నారు. ఈ రోదసి యాత్రకు తాము సిద్ధంగా ఉన్నామని, మూడోసారి అంతరిక్షయాత్రలో పాల్గొనడం సంతోషంగా ఉన్నదని సునీతా విలియమ్స్ తెలిపారు. ఈ యాత్ర విజయవంతమైతే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి సిబ్బందిని తీసుకెళ్లి, తీసుకొచ్చిన రెండవ ప్రైవేట్ సంస్థగా బోయింగ్ ఆవిర్భవిస్తుంది.

ఆస్ట్రేలియా వీసాలకు టోఫెల్

- తిరిగి పరిగణనలోకి
- వెల్లడించిన ఈటీఎస్

న్యూఢిల్లీ, మే 6: ఆస్ట్రేలియా వీసాలకు టోఫెల్ స్కోరును తిరిగి పరిగణనలోకి తీసుకోనున్నారు. ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) సోమవారం ఈ విషయం వెల్లడించింది. ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని తెలిపే 'టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఏ ఫారెన్ లాంగ్వేజ్' (టోఫెల్)ను ప్రిన్స్‌టన్‌కు చెందిన ఏజెన్సీ ఈటీఎస్ నిర్వహిస్తున్నది. 2024 మే 5 తర్వాత టోఫెల్ పరీక్షల స్కోర్ ఆస్ట్రేలియాలో అన్ని రకాల వీసాలకు లెక్కలోకి వస్తుందని ఈటీఎస్ తెలిపింది. టోఫెల్ స్కోర్‌పై గత ఏడాది జూలైలో ఆస్ట్రేలియా సమీక్ష చేపట్టింది. వీసా జారీలో ఈ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపింది. దీంతో 60 ఏండ్లుగా కొనసాగుతున్న టోఫెల్ టెస్ట్‌లో ఈటీఎస్ కొన్ని మార్పులు చేపట్టింది. 'టోఫెల్ ఐబీటీ' అనేది తీసుకురాగా, దీనిపై సమీక్ష జరిపిన ఆస్ట్రేలియా హోం శాఖ (డీహెచ్‌ఏ) సంతృప్తి వ్యక్తం చేసింది. 'మరింత మెరుగుపర్చిన టోఫెల్ పరీక్ష.. వీసా దరఖాస్తుదారుల ఆంగ్ల భాష సామర్థ్యానికి కొలమానంగా డీహెచ్‌ఏ భావిస్తున్నది' అని ఈటీఎస్ ఇండియా, దక్షిణాసియా కంట్రీ మేనేజర్ సచిన్ జైన్ చెప్పారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రిటన్.. ప్రపంచంలోని అనేక దేశాల్లో 12,500కిపైగా విద్యా సంస్థలు టోఫెల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

స్టూడెంట్ వీసా నిబంధనలు కఠినతరం

స్టూడెంట్ వీసా నిబంధనల్ని ఆస్ట్రేలియా కఠినతరం చేస్తున్నది. 2025 నాటికి వలసల్ని సగానికి తగ్గించే ప్రయత్నంలో భాగంగా, భారత్ వంటి దేశాలకు చెందిన విద్యార్థుల వీసాలను ఆలస్యం చేయటం, తిరస్కరించటం వంటి చర్యలను ఆస్ట్రేలియా చేపడుతున్నది. దీంతో ఆ దేశంలోని పలు విశ్వవిద్యాలయాలు భారతీయ విద్యార్థులను చేర్చుకోవటం లేదు. ప్రధాని ఆంథోనీ అల్బనీస్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా ప్రభుత్వం విద్యార్థుల వీసా నిబంధనల్ని కఠినతరం చేసింది. ఐఈఎల్‌టీఎస్ అర్హత స్కోర్ పెంచటం, ఆర్థికపరంగా అర్హత ప్రమాణాల్ని పెంచటం వంటివి ప్రస్తుత ప్రభుత్వం చేపట్టింది. దీంతో 2022 డిసెంబర్-2023 డిసెంబర్ మధ్యకాలంలో ఆస్ట్రేలియా వీసా దక్కిన భారతీయ విద్యార్థుల సంఖ్య 48శాతం తగ్గినట్టు ఓ నివేదిక పేర్కొన్నది. వీసా తిరస్కరణపై కాన్‌బెర్రాలోని భారత హై కమిషన్ కార్యాలయం స్పందించింది. ఆస్ట్రేలియాకు వస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో రెండో అతిపెద్ద దేశం భారత్ కావటమే దీనికి కారణమని అభిప్రాయపడింది. 2023 జనవరి-సెప్టెంబర్ మధ్య కాలంలో ఆస్ట్రేలియాలో 1.22 లక్షల మంది భారతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఆస్ట్రేలియాలో భారత విద్యార్థి హత్య

నవ్‌జీత్ సంధూ (22) అనే ఎంటెక్ విద్యార్థి ఆస్ట్రేలియాలో మరో భారతీయ విద్యార్థి చేతిలో హత్యకు గురయ్యాడు. ఇంటి అద్దె విషయమై కొందరు భారత విద్యార్థుల మధ్య జరుగుతున్న గొడవను పరిష్కరించేందుకు నవ్‌జీత్ ప్రయత్నించినప్పుడు ఈ దారుణం చోటు చేసుకొంది. హర్యానాలోని కర్నాల్‌కు చెందిన మృతుడి మామ యశ్‌వీర్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. 'నవ్‌జీత్‌ను అతడి స్నేహితుడొకరు కొన్ని సామాన్లు తెచ్చేందుకు కారు కావాలని అడిగారు. అతడి ఇంటికి నవ్‌జీత్ తన కారు తీసుకెళ్లాడు. అక్కడ కొందరు భారత విద్యార్థులు అద్దె విషయమై గొడవ పడుతున్నారు. గొడవ పడకండని నవ్‌జీత్ వారికి సర్ది చెప్పే ప్రయ్నతం చేశారు. దీంతో కోపోద్రిక్తుడైన ఒక విద్యార్థి కత్తితో నవ్‌జీత్‌ను పొడిచి చంపాడు' అని యశ్‌వీర్ తెలిపారు. నిందితుడు కూడా కర్నాల్ ప్రాంతానికి చెందినవాడేనని చెప్పారు. నవ్‌జీత్ తెలివైన విద్యార్థి అని.. జూలైలో సెలవుల సమయంలో అతడు స్వదేశానికి రావాల్సి ఉందని యశ్‌వీర్ వాపోయారు. నిందితులైన ఇద్దరు భారత విద్యార్థులు అభిజిత్, రాబిన్ గార్టన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రఫాను ఖాళీ చేయండి

- పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ ఆదేశం
- నగరంపై సైన్యం దాడులు మొదలు

జెరూసలెం: గాజా స్ట్రిప్‌లోని రఫా నగరం నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం సుమారు ఒక లక్ష మంది ప్రజలను ఆదేశించింది. దీంతో క్షేత్ర స్థాయిలో యుద్ధం సమీపంలోనే ఉందనే సంకేతాలు వస్తున్నాయి. రఫాపై దాడి చేస్తే కాల్పుల విరమణ ఒప్పందం కోసం జరుగుతున్న ప్రయత్నాలు పట్టాలు తప్పుతాయని హమాస్, ఖతార్ తెలిపాయి. ఈ ఒప్పందం కోసం ఖతార్ మధ్యవర్తిత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే హమాస్‌కు ప్రాబల్యం గల ప్రాంతాల్లో రఫా ఒకటి అని, ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూప్ హమాస్‌ను మట్టికరిపించాలంటే ఇక్కడ క్షేత్ర స్థాయిలో యుద్ధం చేయవలసిన అవసరం ఉందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. సోమవారం రఫాపై ఇజ్రాయెల్ దాడులు చేసినట్లు స్థానికులు తెలిపారు. కాగా, ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నడవ్ షోషని మాట్లాడుతూ పరిమిత స్థాయిలో ఆపరేషన్‌కు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

కాల్పుల విరమణకు హమాస్ అంగీకారం

గాజాలో ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధానికి తెర దించేందుకు హమాస్ అంగీకరించింది. ఈ యుద్ధంలో కాల్పుల విరమణకు ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులు చేసిన ప్రతిపాదనలను అంగీకరించినట్లు హమాస్ సోమవారం ప్రకటించింది. రఫా నగరం నుంచి దాదాపు లక్ష మంది వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించిన తరుణంలో హమాస్ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే దీనిపై ఇజ్రాయెల్ నుంచి స్పందన రాలేదు.

కొలంబియా వర్సిటీ గ్రాడ్యుయేషన్ వేడుక రద్దు

వాషింగ్టన్: పాలస్తీనా అనుకూల నిరసనల నేపథ్యంలో ఈ నెల 15న నిర్వహించాలనుకున్న గ్రాడ్యుయేషన్ వేడుకను రద్దు చేస్తున్నట్టు అమెరికాలోని కొలంబియా వర్సిటీ ప్రకటించింది. గడచిన కొద్ది వారాలు తమకు చాలా కష్ట కాలమని తెలిపింది. క్లాస్ డేస్, స్కూల్ లెవెల్ కార్యక్రమాలను ప్రముఖంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. వీటిలో విద్యార్థులను వారి సహ విద్యార్థుల సమక్షంలో వ్యక్తిగతంగా గౌరవించనున్నట్లు తెలిపింది.

అణ్వాయుధాల విన్యాసాలకు పుతిన్ ఆదేశం

మాస్కో: అణ్వాయుధాల విన్యాసాలను నిర్వహించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆ దేశ సైన్యాన్ని ఆదేశించారు. నావికా దళం, వాయుసేన, పదాతి దళం కూడా వీటిలో పాల్గొనాలని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సమీపంలోని దళాలు కూడా వీటిలో పాల్గొంటాయి. ఉక్రెయిన్‌తో రెండేళ్ల నుంచి యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఫిబ్రవరిలో ఆయన జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ, అణ్వాయుధ యుద్ధం జరిగే ముప్పు ఉందని హెచ్చరించిన సంగతి తెలిసిందే. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, వ్యూహాత్మకం కానటువంటి అణ్వాయుధాలను వినియోగించడం, సమాయత్తం చేయడం కోసం కొన్ని చర్యలు తీసుకుంటారు. రష్యా భౌగోళిక సమగ్రతను కాపాడుకోవడం కోసం త్వరలోనే ఈ విన్యాసాలు జరుగుతాయి. కొందరు పాశ్చాత్య దేశాల నేతల హెచ్చరికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

అన్ని కరోనా వైరస్‌లకు ఒకే వ్యాక్సిన్!

లండన్, మే 6: అన్ని రకాల కరోనా వైరస్‌ల నుంచి రక్షణ కల్పించే ఆల్ ఇన్ వన్ వ్యాక్సిన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత యూనివర్సిటీలకు చెందిన పరిశోధకుల బృందం దీనిని అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో పుట్టుకొచ్చే కొత్త కరోనా వైరస్‌లను సైతం ఈ టీకా ఎదుర్కొనగలదని వారు వెల్లడించారు. 'ప్రోయాక్టివ్ వ్యాక్సినాలజీ' అనే కొత్త విధానం ద్వారా సైంటిస్టులు ఈ టీకాను అభివృద్ధి చేశారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో మంచి ఫలితాలు వచ్చినట్టు వారు తెలిపారు. కొవిడ్ 19ను కలుగజేసే సార్స్‌కోవ్2తోపాటు ప్రస్తుతం గబ్బిలాల్లో వ్యాప్తి చెందుతున్న కరోనావైరస్‌లలోని నిర్దిష్ట ప్రాంతాల్ని రోగ నిరోధక శక్తి గుర్తించగలిగేలా ఈ కొత్త వ్యాక్సిన్ పనిచేస్తుంది.

శబరిమలలో స్పాట్ బుకింగ్ రద్దు

వచ్చే సీజన్ నుంచి రోజుకు 80 వేల మందికే దర్శనం

తిరువనంతపురం, మే 6: కేరళలోని శబరిమల అయ్యప్ప దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు తాజాగా కీలక నిర్ణయం తీసుకొన్నది. దర్శనానికి ఇచ్చే స్పాట్ బుకింగ్‌లను రద్దు చేసింది. వచ్చే మండల, మకరవిళక్కు సీజన్ నుంచి దేవస్థానం అధికారిక వెబ్‌సైట్‌లో వర్చువల్ క్యూ ద్వారా బుకింగ్ చేసుకొన్న వారినే అయ్యప్ప దర్శనానికి అనుమతించనున్నారు. రోజుకు 80 వేల మంది మాత్రమే అయ్యప్పను దర్శించుకొనేలా ఆన్‌లైన్ బుకింగ్‌పై పరిమితి విధిస్తామని అధికారులు తెలిపారు. ఇప్పుడు మూడు నెలల ముందుగానే వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.

10న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ధామ్

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ధామ్‌లో కేదరనాథునికి ఆదివారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులకు ఈ నెల 10 నుంచి దర్శనానికి అనుమతి ఇస్తారు. ఉఖిమఠ్‌లోని ఓంకారేశ్వర దేవాలయంలో భైరవనాథునికి ఆదివారం సాయంత్రం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పంచముఖి భోగమూర్తి పల్లకి యాత్ర సోమవారం ఉఖిమఠ్‌లోని ఓంకారేశ్వర దేవాలయం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 9న కేదార్‌నాథ్ ధామ్‌కు చేరుకుంటుంది. ఈ నెల 10న ఉదయం 7 గంటలకు కేదార్‌నాథ్ ధామ్ తలుపులు భక్తుల పూజల కోసం తెరుచుకుంటాయి.

వాటర్ బ్యాటరీస్!

బీజింగ్: చైనాకు చెందిన పరిశోధకులు సరికొత్త వాటర్ బ్యాటరీలను అభివృద్ధి చేశారు. సంప్రదాయ లిథియం బ్యాటరీలతో పోలిస్తే, ఇవి రెట్టింపు స్థాయిలో శక్తిని నిల్వ చేసుకుంటాయని పరిశోధకులు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల్లో ఈ బ్యాటరీలను వినియోగించేందుకు ఈ సాంకేతికత కీలకం కానున్నదని పేర్కొన్నారు. ఇతర బ్యాటరీలతో పోలిస్తే ఈ వాటర్ బ్యాటరీలు ఎంతో సురక్షితమైనవని వెల్లడించారు.

ఇండియన్ సినిమా రూపురేఖలు మార్చే 'కల్కి'

ప్రభాస్ 'కల్కి 2989 ఏడీ'లో తాను నటిస్తున్నట్టు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తేల్చి చెప్పేశారు టాలీవుడ్ హల్క్ రానా. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ భారీ పాన్‌ఇండియా సినిమాలో అమితాబ్, కమల్‌హాసన్, దీపికా పదుకొణే, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. వీళ్లతోపాటు రానా కూడా ఇందులో ముఖ్యభూమిక పోషిస్తున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. వీటిపై తన తాజా ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చారు రానా. 'నేనూ, డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఇద్దరం ఒకటో తరగతి నుంచీ ఫ్రెండ్స్. పైగా తను నా తొలి సినిమా 'లీడర్'కి శేఖర్ కమ్ముల దగ్గర అసిస్టెంట్‌గా పనిచేశాడు. మా ఇద్దరి అనుబంధం ఈనాటిది కాదు. అందుకే విదేశాల్లో జరిగిన 'కల్కి' ప్రమోషన్స్‌లో పాల్గొన్నాను. దాంతో ఆ సినిమాలో నేనూ ఉన్నట్టు రాసేస్తున్నారు. నిజానికి 'కల్కి'లో నేను లేను. అయితే ఒక్కటి మాత్రం చెప్పగలను. 'కల్కి' సామాన్యమైన సినిమా కాదు. ఈ సినిమాతో ఇండియన్ సినిమా రూపురేఖలు మారనున్నాయి. 'ఎవెంజర్స్' స్థాయి సినిమా అవుతుంది' అని చెప్పారు రానా.

బాత్ పిక్ తెచ్చిన తంటా

మనకు పెద్దగా కనిపించని విషయం.. పక్కవాళ్లకు భూతద్దంలో కనిపించవచ్చు. అందుకే మన చర్యల పరిణామాలను ముందుగా పసిగట్టి జాగ్రత్త తీసుకోవాలి. ఈ విషయంలో కొందరు సినీ సెలబ్రిటీలు వీక్. తొందరపడి పోస్టులు పెట్టేయడం, తర్వాత నాలిక కరుచుకోవడం. చాలామంది విషయంలో ఇది పరిపాటైపోయింది. నిరంతరం వార్తల్లో ఉండే స్టార్ హీరోయిన్ సమంత.. టవల్ కట్టుకొని ఇన్ఫ్రారెడ్ ఆవిరి బాత్ చేస్తున్న పిక్ ఒకటి తాజాగా పోస్టు చేసింది. ఆ పోస్ట్‌లో ఈ బాత్ వల్ల కలిగే ప్రయోజనాలను కూడా రాసింది. ఏమనుకుందో ఏమో.. అంతలోనే పోస్ట్‌ను డిలీట్ చేసేసింది. అయితే ఈ కొద్ది సమయంలోనే ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. కొందరు ఆకతాయిలైతే సమంత పోస్ట్ చేసిన పిక్‌ను మార్ఫింగ్ చేసి, ఇబ్బందికరంగా చూపిస్తూ వైరల్ చేశారు. సామ్ అభిమానులేమో ఒరిజినల్ పిక్‌ను వైరల్ చేస్తున్నారు. ఏదేమైనా మొత్తంగా బూమరాంగ్ అయ్యింది. ఈ నేపథ్యంలో సమంత పరోక్షంగా స్పందిస్తూ.. 'మిమ్మల్ని మీరు సమర్థించుకోవాల్సిన అవసరం లేకుండా.. నిరూపించుకోవాల్సిన అవసరం రాకుండా జీవించడమే నిజమైన విజయం' అనే కొటేషన్‌ని పోస్ట్ చేసింది. ఈ పిక్‌పై జరుగుతున్న రాద్ధాంతానికి ఫుల్‌స్టాప్ పెట్టడానికే సామ్ ఈ క్యాప్షన్ షేర్ చేసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చిత్రం

అప్పడు చరణ్‌తో.. ఇప్పడు హృతిక్‌తో

తారక్, చరణ్ కలిసి 'నాటునాటు..' అంటూ స్టెప్పులేస్తే వారి ఆటపాట గురించి ప్రపంచం మాట్లాడుకుంది. ఇప్పుడు ఆ ఫీట్ మళ్లీ రిపీట్ కానుందని సమాచారం. కాకపోతే.. తారక్ అలాగే ఉన్నారు. చరణ్ ప్లేస్‌లోకి మాత్రం హృతిక్‌రోషన్ వచ్చి చేరారు. ప్రస్తుతం ముంబైలో 'వార్ 2' షూటింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తారక్, హృతిక్‌లపై ఓ సాంగ్‌ని తెరకెక్కిస్తున్నారు దర్శకుడు ఆయాన్ ముఖర్జీ. బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా కూడా ఈ పాటలో భాగమైంది. ఇదొక పబ్ సాంగ్. బ్యాగ్రౌండ్‌లో కొన్ని సీన్స్ జరుగుతూ ఉంటే ఈ పాట నడుస్తూ ఉంటుందట. కథలో కీలకమైన సందర్భంలో వచ్చే ఈ పాటలో తారక్, హృతిక్ పోటీపడి మరీ స్టెప్పులేయనున్నారట. ఈ పాట సినిమాకే హైలైట్ అవుతుందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మోస్ట్ వాంటెడ్ పాన్ ఇండియా మల్టీస్టారర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హృతిక్ రోషన్ పాత్రకు దీటైన పాత్రను తారక్ పోషిస్తున్నారని తెలుస్తున్నది. ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

ఉత్తమ రాజకీయ వ్యంగ్యాత్మక చిత్రం

'భీమదేవరపల్లి బ్రాంచి'

దివంగత దిగ్దర్శకుడు, దర్శకరత్న దాసరి నారాయణ రావు పేరిట నెలకొల్పిన 'డీఎన్‌ఆర్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుక ఆదివారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఘనంగా జరిగింది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో, మన యాస భాషలను ఆవిష్కరిస్తూ రూపొందించిన 'భీమదేవరపల్లి బ్రాంచి' చిత్రం ఉత్తమ పొలిటికల్ సెటైర్ మూవీగా పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత డాక్టర్ బత్తిని కీర్తిలత గౌడ్ మాట్లాడుతూ 'ఈ అవార్డును స్వీకరించడం గర్వంగా ఉంది. ఈ పురస్కారం సినీ ఇండస్ట్రీ పట్ల నాకున్న బాధ్యతను మరింతగా పెంచింది' అన్నారు. ఇక 'భీమదేవరపల్లి బ్రాంచి' కథాంశం విషయానికొస్తే.. మోదీ ప్రవేశపెట్టిన జన్‌ధన్ పథకంలో భాగంగా అందరూ బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్ చేస్తారు. ఒకరి ఖాతాలో అనుకోకుండా 15లక్షలు పడతాయి. అ డబ్బులను ప్రభుత్వమే వేసిందని భావించిన సదరు యజమాని వాటిని మొత్తం ఖర్చు పెడతాడు. అయితే ఆ డబ్బులు జన్‌ధన్‌కు సంబంధించినవి కావని, బ్యాంకు తప్పిదం వల్ల అనుకోకుండా క్రెడిట్ అయ్యానని, వాటిని తిరిగి కట్టాల్సిందేనని బ్యాంకు వాళ్లు ఒత్తిడి తీసుకొస్తారు. ఈ నేపథ్యంలో సదరు కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, మోదీ చేసిన మోసాన్ని కళ్లకుకట్టినట్లుగా ఈ సినిమాలో ఆవిష్కరించారు. తెలంగాణ గ్రామీణ వాతావరణంలో స్థానిక యాస, భాషలకు పట్టం కడుతూ ఈ సినిమా అందరిని మెప్పించింది.

మన మధ్య జరిగే కథ

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భలే ఉన్నాడే'. జే. శివసాయివర్ధన్ దర్శకుడు. ఎన్.వి.కిరణ్‌కుమార్ నిర్మాత. దర్శకుడు మారుతి ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఆయన టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ 'రాజ్‌తరుణ్‌తో మంచి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. దర్శకుడు సాయికి ఈ పాయింట్ చెబితే తను బాగా డిజైన్ చేసుకొని తీసుకొచ్చాడు. ఇది కాన్సెప్ట్ బేస్ట్ ఫిల్మ్. మన మధ్యలో జరిగే కథలా ఉంటుంది. శేఖర్‌చంద్ర మంచి పాటలిచ్చారు' అన్నారు. మారుతితో సినిమా చేయాలనే కల ఈ ప్రాజెక్ట్‌తో నెరవేరిందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని హీరో రాజ్‌తరుణ్ తెలిపారు. దర్శకుడిగా తనకిది మొదటి చిత్రమని, ఆద్యంతం నవ్విస్తుందని జె.శివసాయివర్ధన్ చెప్పారు. ఈ సినిమాలో కామెడీ కొత్త పంథాలో ఉంటుందని, పాటలు బాగా కుదిరాయని, సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెల్లా, సమర్పణ: మారుతి టీమ్, ప్రొడక్షన్ డిజైనర్: శివకుమార్ మచ్చ, దర్శకత్వం: జె.శివసాయివర్ధన్.

'లాక్‌డౌన్'లో ఏం జరిగింది?

'టిల్లు స్క్వేర్' చిత్రంతో ఇటీవలే మంచి విజయాన్ని దక్కించుకుంది మలయాళీ సోయగం అనుపమ పరమేశ్వరన్. ప్రస్తుతం ఈ భామ విభిన్న కథాంశాలను ఎంచుకొని సినిమాలు చేస్తున్నది. తమిళంలో కూడా ఈ అమ్మడికి మంచి అవకాశాలొస్తున్నాయి. ఆమె తాజా తమిళ చిత్రం 'లాక్‌డౌన్' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.జీవా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ తెరకెక్కిస్తున్నది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో అనుపమ పరమేశ్వరన్ భయంతో ఏడుస్తూ కనిపిస్తున్నది. లాక్‌డౌన్ నేపథ్యంలో నడిచే థ్రిల్లర్ కథాంశమిదని, స్క్రీన్‌ప్లే సరికొత్తగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమాతో పాటు తమిళంలో అనుపమ పరమేశ్వరన్ 'బైసన్ కాలమాదన్' అనే తమిళ చిత్రంలో కూడా నటిస్తున్నది. ధృవ్ విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిస్తున్నారు. మారి సెల్వరాజ్ దర్శకుడు. ప్రస్తుతం తెలుగులో 'పరదా' చిత్రంలో నటిస్తున్నది అనుపమ పరమేశ్వరన్.

కళ్లు లేకుండా జీవితాన్ని గెలిచిన విజేత

'దర్శకుడు తుషార్ హీరానందానీ 'శ్రీకాంత్' కథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఇలాంటి వ్యక్తి ఈ భూప్రపంచంలో ఉన్నాడా?! అనిపించింది.' అన్నారు జ్యోతిక. కళ్లు లేని దివ్యాంగుడైన తెలుగు పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా బయోపిక్‌గా తెరకెక్కిన బాలీవుడ్ చిత్రం 'శ్రీకాంత్'. ఇందులో శ్రీకాంత్‌గా రాజ్‌కుమార్‌రావ్ నటించగా, జ్యోతిక కథలో కీలకమైన పాత్ర పోషించారు. తుషార్ హిరానందానీ దర్శకుడు. భూషణ్‌కుమార్, కిషన్‌కుమార్, నిధి పర్మార్, హీరానందాని నిర్మాతలు. ఈ నెల 10న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా హైదరాబాద్‌లో జ్యోతిక విలేకరులతో ముచ్చటించారు.

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నారు. కళ్లు లేకుండా జీవితాన్ని గెలవడం చిన్న విషయం కాదు. అందుకే అలాంటి గొప్ప వ్యక్తి కథలో నటించడం గౌరవంగా భావించాను. శ్రీకాంత్ బొల్లాగా రాజ్‌కుమార్‌రావు నటన అద్భుతంగా ఉంటుంది. కళ్లు లేని దివ్యాంగుడిలా నెక్ట్స్ లెవల్లో నటించారాయన.

శ్రీకాంత్ బొల్లా కథలో చాలా కోణాలున్నాయి. ఆయన జీవితాన్ని ప్రభావితం చేసిన స్త్రీమూర్తులు చాలామంది ఉన్నారు. వారందరినీ కలిపి ఓ కేరక్టర్‌ని క్రియేట్ చేశారు దర్శకుడు తుషార్. నా పాత్ర అదే. ఈ సినిమాలో ఉపాధ్యాయురాలిగా కనిపిస్తా. శ్రీకాంత్‌ని ప్రభావితం చేసే పాత్ర అన్నమాట. మంచితనం, సామాజిక స్పృహ కలగలిసిన గొప్ప పాత్ర. విశేషమేంటంటే నేను టీచర్‌గా నటించిన మూడో సినిమా ఇది.

ప్రస్తుతానికి ఈ సినిమాతోపాటు ఒక వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాను. కాస్త ఖాళీ దొరికితే పిల్లలతో సరిపోతుంది. సూర్య కూడా తన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తెలుగులో నటించి చాలాకాలం అయ్యింది. మంచి పాత్ర లభిస్తే తెలుగులో కూడా చేస్తాను.

సత్య.. ఓ టీనేజ్ లవ్‌స్టోరీ

హమరేశ్, ప్రార్థన సందీప్ జంటగా నటించిన టీనేజ్ ప్రేమకథ 'సత్య'. వాలీ మోహన్‌దాస్ దర్శకత్వంలో తమిళంలో రూపొందిన ఈ చిత్రాన్ని శివ మల్లాల తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 10న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకులు సతీశ్ వేగేశ్న, మధుర శ్రీధర్, కృష్ణ చైతన్య, పవన్ సాధినేని, అర్జున్, సీనియర్ జర్నలిస్ట్ ప్రభు అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఒక జర్నలిస్ట్‌గా రివ్యూ ఇద్దామని సినిమా చూశా. దీన్ని తెలుగు ప్రేక్షకులకు కూడా చూపించాలి అనిపించి నిర్మాతగా మారాను' అని శివ మల్లాల అన్నారు. ఇంకా చిత్రబృందం మాట్లాడారు.